


వేసవి గాడ్పుల ఉధృతం తగ్గి, ఆరోజే పడిన వర్షపు జల్లుకి భూమి పులకరించింది. వట్టివేళ్ల తడికెలు విప్పి కిటికీలు బాగా తెరిచి పడక కుర్చీలో కూర్చున్న సుమిత్ర అప్పుడే వాకిట్లో ఆగిన నల్లని ఏంబాసిడర్ లోనుంచి ఎవరు దిగుతారో వని ఆత్రుతగా కళ్ళు పెద్దవి చేసి చూసింది.

ముందు సీట్లోనుంచి దిగిన యువకుడు టెరిలిన్ సూట్ వేసుకుని కళ్ళకి నల్ల అద్దాలు పెట్టుకుని రీవిగా యింటివైపు చూశాడు. ఒంటిగంట మధ్యాహ్నం కూడా ఐదుగంటల సాయంత్రంలా వున్న ఆరోజు కళ్ళకి నల్ల అద్దాలు ఏమిటో అనుకుంది సుమిత్ర. అతను స్టైయిల్‌గా నిలబడి వెనక డోర్ తీశాడు. పాలనురుగ లాంటి తెల్లని టెరిలిన్ చీరె కట్టి, అంతకన్నా తెల్లని సిల్కు జాకెట్టు వేసుకుని నొక్కుల జుత్తుపైకి దువ్వి 'వి' ఆకారంలో ముడి వేసిన అమ్మాయి నవ్వుతూ కారులోనుంచి బయట కాలుపెట్టింది. బొడ్డుమల్లె పువ్వులా బొద్దుగా వున్న ఆ అమ్మాయి. వకుళే నని పోల్చుకుని గబగబ వాకిట్లోకి పరిగెత్తింది సుమిత్ర.

డ్రయివర్ సీట్లోనుంచి దిగి, "చూశావా నీ ఫ్రెండ్‌ని పట్టుకొచ్చాను" అన్నాడు కృష్ణమూర్తి.

వకుళ సుమిత్ర చెయ్యి పట్టుకుని బలంగా వూపుతూ "ఎన్నాళ్ళకి కనిపించావ్!" అంది పొయిటిక్‌గా.

"ఈయన మా శ్రీవారు—మిస్టర్ శ్రీనివాసరావ్. శ్రీనివాస్ ఆటోస్టోర్స్‌కి ప్రొప్రయిటర్— మాదిపెద్ద బిజినెస్ కన్సర్న్‌లే— అంతేకాదు ఆయన ఆటోమొబైల్ ఇంజినీర్ కూడా......" వకుళ పరిచయంచేస్తున్న ధోరణికి ఆమెభర్త సిగ్గుపడిపోవటం చూసి నవ్వుకుంది. సుమిత్ర— పిన్ని కూతురు పెళ్లికని కార్లో వస్తున్నారట హైదరాబాద్‌నుంచి. కృష్ణమూర్తి ఆఫీసుకు

వెడుతూ రిక్షాలో కనిపించాడట బస్ స్టాండ్ దగ్గర. ఇంటికి బలవంతపెట్టి తీసుకొచ్చాడట. వకుళ చెప్పింది. "అంత బలవంతపెడితేగాని రావన్నమాట మాయింటికి. ......" అన్నది సుమిత్ర నిష్ఠురంగా. వకుళ భర్త డ్రెస్ మార్చుకుని నిద్ర కుపక్రమించాడు. స్నేహితురాళ్లిద్దరూ మాటా మంతీ మొదలు పెట్టారు అవతల గదిలో కూర్చుని.

వకుళ చెవులకి గుత్తులుగుత్తులుగా వ్రేలాడుతున్న ముత్యాల సరాలను చూస్తూ కూర్చుంది సుమిత్ర. డబ్బుతోపాటు హుందాతనం, హోదాతోపాటు ఒకకొత్త అందం వస్తాయి కాబోలు! కాలేజీలో చదివే రోజుల్లో వకుళ సన్నగా, గాలివీస్తే పడిపోయేలా వుండేది. చురుకుదనం లేకుండా మందమతిలా వుండేది.ఆమె యిప్పుడు చాలా హుషారుగా మాట్లాడుతోంది. మధ్యమధ్య చమత్కారాలు, చెణుకులు విసురుతూ.....

"నువ్వేం మాట్లాడవేం.. మీగురించి చెప్పు—"అంది వకుళ ఉన్నట్లుండి. విజయవాడలో ఎండలని గురించి అక్కడ లారీల రొద గురించి, రోడ్లని గురించి, చెట్లు లేని పార్కులను గురించి ఇంకా ఎన్నింటినో గురించి చెప్పింది సుమిత్ర "ఇన్నింటి మధ్యా మేమింత వరకూ ప్రశాంతంగానే గడుపుతున్నాం" అని ముగించింది.

"నేనొచ్చేవరకూనా?" అని విరగబడి నవ్వింది వకుళ. సుమిత్ర సరళంగా నవ్వి వూరుకుంది.

సాయంత్రం వరండాలో కూర్చుని కబుర్లలోకి దిగారు నలుగురూ. వకుళ కేవలం సుమిత్రకే స్నేహితురాలుకాదు. కృష్ణమూర్తికి క్లాస్‌మేట్‌కూడా ... కృష్ణమూర్తి అభిమానుల్లో వకుళ ఒకర్తె. ఆమె అభిమానానికి ఆమెకారూ, మేడా అడ్డు వచ్చేవి. అంచేత కృష్ణమూర్తిని కేవలం "విష్" చేసి మాత్రం వెళ్లిపోయేది.

వకుళతో మాట్లాడుతూ వుంటే ఆవిషయాలు గుర్తువస్తున్నాయి సుమిత్రకు.

పిన్నిగారింటికి వెళ్లడానికి ప్రత్యేకంగా ముస్తాబయింది వకుళ. దోసెడు వెడల్పు జరీ అంచున్న కంజీవరం పట్టుచీరెకట్టి, అంచు రంగుకి మాచ్ అయ్యే తిరుచూర్ణం రంగు బ్లవుజు వేసుకుని, రెండు వరసల ముత్యాల హారం ధరించింది. చీరెమీదకి పొడవుగా వ్రేలాడుతున్న ముత్యాలహారాన్ని బరువుగా అంటిపెట్టుకుని వుంది పెద్ద లాకెట్. చెవులకి కెంపుల దుద్దులు పెట్టుకుంది.

సుమిత్ర షర్బత్ కలిపి యిచ్చింది. షర్బత్ అందుకుంటున్నప్పుడు వకుళ తెల్లని వ్రేలుకి ధరించిన కెంపుల వుంగరం కాంతి తెల్లని గాజు టంబ్లర్ మీదపడి వింతగా మెరవడం చూసింది సుమిత్ర. వకుళని చూస్తూ వుంటే పూర్వంలా నవ్వురాలేదు సుమిత్రకి.

"ఇంత ఖరీదైన అలంకారమా?" అని ఆశ్చర్యపడలేకపోయింది. వకుళని యింకా యింకా చూడాలనిపించింది. అంతేకాదు, ఆమెధరించిన లాంటి నగలూ, దుస్తులూ తను ధరిస్తే వకుళ కన్న తనేఅందంగా వుంటుందనే భావంకూడా ఆమెమనస్సులో మొలిచింది. వకుళా, శ్రీనివాసరావూ చాలా హుషారుగా మాట్లాడుతున్నారు కృష్ణమూర్తితో. సుమిత్ర చాలా యిబ్బంది పడిపోయింది. స్వేచ్ఛగా వుండలేక పోయింది.

శ్రీనివాసరావు పెళ్లిచూపులకి రావడం దగ్గర్నుంచి, అతనికి తన తండ్రి కట్నం, కానుకలు, అతనికున్నఆస్తిపాస్తులు అతని తెలివి తేటలు అతని ప్రతిభావిశేషాలు తెగ వివరిస్తోంది వకుళ.

మొగవాళ్ల మనస్సుని ఆకట్టుకోడానికి ఆడవాళ్లు చేసే గమ్మత్తులలో వాళ్ల ప్రతిభను పొగడడం ఒకటి అనుకుంది సుమిత్ర అసూయగా.

"మీ మామగారు చాలా మంచివారండి. శ్రీనివాసరావ్‌గారూ—అలాంటివాళ్లు వుండడం అరుదు" అన్నాడు కృష్ణమూర్తి. కృష్ణమూర్తి ముఖంలో వచ్చిన మార్పుని స్పష్టంగా గుర్తించింది సుమిత్ర. కృష్ణమూర్తి అక్కడితో ఆగలేదు. తను సుమిత్రని కావాలనుకోడం దగ్గర్నుంచి, ఇప్పుడు సుమిత్రకి వాళ్లనాన్నగారు ఒక 'కార్డు ముక్కైనా" వ్రాయక పోవడందాకా సవివరంగా చెప్పుకు పోయాడు. సుమిత్ర పడుతున్న యిబ్బందిని ఏమాత్రం గ్రహించని వాడై.

ప్రసంగం మార్చడానికన్నట్లు వకుళ అన్నది "త్వరలో మావారు అమెరికా వెడతారు— నేనూ వెళ్లాలని వుంది"అని వూరుకోలేదు. విమానం టికెట్లు మానాన్నగారే కొంటారు సుమా అని కూడా అన్నది.

వాళ్లు అమెరికా వెళ్లడం ఎందుకో అర్థంకాని సుమిత్ర మవునంగా కూర్చుంది. పెళ్లిసుముహూర్తం వేళవుతోందని వాళ్లు బయలు దేరారు. కృష్ణమూర్తికూడా కుర్చీలోంచి లేవగానే "అమ్మయ్యా" అనుకుంది సుమిత్ర.

వకుళకీ తనకీమధ్య పెద్ద ఇనపగోడ అడ్డం వున్నట్లూ, తనూ ఆమే పూర్వంలా మెలగడానికి ఏమాత్రం వీలు లేనట్లూ అనుకుంది సుమిత్ర. అంతేకాదు 'వకుళ వంటి అమ్మాయిని, వకుళ నాన్నగారి అంత గొప్పవాడికూతుర్ని చేసుకోలేక పోయినందుకు కృష్ణమూర్తి విచారిస్తున్నాడేమో యిప్పుడు?' అని కూడా అనిపించింది. ఈ భావం వచ్చిన వెంటనే ఆమెకి పట్టరానంత కోపం వచ్చింది.

"ఛీ! ఏం మనుష్యులు" అనుకుంది. అలా అనుకున్నవెంటనే ఆమెకి భూతకాలంలో తానుచేసిన త్యాగాలన్నీ ఒకటి తరువాత ఒకటి కళ్లముందుకు వొచ్చి, క్వశ్చన్ మార్కు ముఖాలు వేసుకుని నిలబడ్డాయి. 'మాకు దొరికిన ప్రతిఫలం ఇదన్నమాట" అన్నట్లుగా.

చాలా నీరసంగా ఫీలయింది సుమిత్ర. ఈ ప్రపంచంలో మంచికి చోటులేకుండా పోయిందని విచారపడింది ఆమె. సమయం రాత్రి ఏడుగంటలని చెబుతున్నట్లుగా రేడియోలో ఎవరో అమ్మాయి దిగులు గొంతుతో వార్తలు చదువుతోంది. బహుశా రైలు ప్రమాదాలకీ అగ్నిప్రమాదాలకీ విచారపడి ఆమె కంఠం అలా అయిందేమో! "అలావున్నావేం, సుమీ! వంట్లో బాగా లేదూ! నాకు చెప్పకూడదా, డాక్టరుకి కబురు చేసే వాడిని" అన్నాడు కృష్ణమూర్తి ఇంటికి వస్తూనే....

"నావొంటికేం చాలా బాగుంది. థాంక్స్" అని విసురుగా అక్కడనుంచి వెళ్లిపోయింది.

తెల్లబోయిన కృష్ణమూర్తి కూలబడ్డాడు. ఇటువంటి కోపాలూ, అలకలూ అతనికింత వరకూ అనుభవం లేవు— కొంచెం చిలిపిదన్న మాటేగానీ సుమిత్ర చాలా మంచి పిల్ల.

లోపల వంటచేసుకుంటూన్న సుమిత్ర ఎప్పటికిమల్లే కూనిరాగం తీయడంలేదు. డైనింగ్ టేబిల్ దగ్గరకూడా సుమిత్ర చాలాముభావంగా వుంది. రాత్రి పన్నెండు ఒంటిగంట సమయంలో కూడా ఆమె కళ్లు తెరచుకుని సీలింగ్ ఫ్యాన్‌కేసి దీక్షగా చూస్తూ వుండడం కృష్ణమూర్తి గమనించాడు. ఆమెని అంతగా కలత పెడు

తూన్న ఆలోచన ఏమిటో అతనికి అర్థం కాలేదు.

మరునాడు నిద్రలేస్తూనే పాత పేపర్లు ముందువేసుకుని ఏదో వెతుకుతోంది సుమిత్ర..... ఏదో ఉద్యోగం తాలూకు ప్రకటన అని కనిపెట్టడానికి ఎక్కువ సమయం పట్టలేదు కృష్ణమూర్తికి. అతనిమస్తిష్కాన్ని అనేక ఆలోచనలు చుట్టివేశాయి ...... 'వానలో తడిసిన మాత్రానే వారంరోజులు జ్వరం కాస్తుంది సుమిత్రకి. రెండు మూడుగంటలు ఫ్యాన్ ఎదురుగా కూర్చుంటే తలనెప్పిరావడం తథ్యం. రెండున్నరకి కాఫీ త్రాగక పోతే మతేవుండదు. ఐదు గంటలకి వరండాలో చల్లగాలికి పడక కుర్చీలో కూర్చుంటేగానీ తోచదు. ఉద్యోగం చేస్తాననడం బింకం కాక మరేమిటి అనుభవాన్ని మించిన గురువులేదని సామెత. ఒకమాటు చెయ్యి కాలితేగాని నిప్పు జోలికి వెళ్ళకుండా వుండరు పిల్లలు' అనుకుని నవ్వుకున్నాడు కృష్ణమూర్తి.

అతను ఆఫీసుకు వెడుతూంటే సాయంత్రం కార్యక్రమం ఏమిటో చెప్పలేదు సుమిత్ర. పెన్నూ, తాళంచెవులూ దాచలేదు. ఈ డ్రస్ బాగాలేదు, అషర్టు కుదరలేదు అంటూ ఏడిపించలేదు. చాలా గంభీరంగా అతనికి అవసరమైన వన్నీ అందించింది.

"నేను వెడుతున్నాను సుమిత్రా" అంటే "హూ" అంది.

"వెళ్ళగానే ఉత్తరం రాయండి" అనకుండా .......

సాయంత్రం అతను వచ్చేసరికి కిటికీ వూచల్లో దూరి వున్న చీటీ పలకరించింది.....

"నేను కుముదిని యింటికి వెడుతున్నా— ఎన్నిగంటలకు వస్తానో చెప్పలేను"

కుముదిని మంగపతి రావుగారి అమ్మాయి. ఆయనకి బెజవాడలో పెద్దమేడా, రెండు కార్లేగాక పెద్దపెద్ద కంపెనీల్లో షేర్లూ కావలసినంత పలుకుబడీవున్నాయి. మంగపతిగారు రికమెండ్ చేసిన అభ్యర్థికి ఎక్కడైనాసరే ఉద్యోగం ఇవ్వమని వేసితీరవలసిందే. కుముదిని యింటికి వెళ్ళడంలో సుమిత్ర ఆంతర్యం అర్థం అయింది కృష్ణమూర్తికి. ఆమె ఉద్యోగం కోసం చాలా గట్టిగా ప్రయత్నిస్తోందన్న మాట!

ఎనిమిదిన్నరకి యింటికి వచ్చిన సుమిత్రని అతను ఏమీ అడగనూలేదు, ఆమె ఏమీ

# చిరుగాలి

చెప్పనూలేదు. చాలా మామూలుగా భోజనానికి రమ్మని పిలిచింది. కొత్తవాళ్ళకి వడ్డించినట్లు వడ్డించింది. అతను అడగకుండానే కుముదినికి పెళ్ళి సంబంధం కుదిరిందనీ, పెళ్ళికొడుక్కి నయవేలిలో ఉద్యోగం అనీ చెప్పింది.

"నీకిప్పుడు ఉద్యోగం దేనికి! నిన్నంతా అలా వున్నావేం! నేను ఏమైనా అన్నానా? లేక వంట్లో బావుండలేదా! మనిద్దరి మధ్యా దూరం పెంచుతున్నావెందుకూ!" అని అడగాలనిపించింది. కృష్ణమూర్తికి. ఇప్పుడిప్పుడే మంచిమూడ్‌లోకి వస్తున్న సుమిత్ర మళ్ళీ కదిలించడం ఎందుకని, ఆమె చెప్పేదంతా సీరియస్‌గా విన్నట్లు నటించాడు. నిజానికి అతని బుర్రలోకి ఏమీ దూరలేదు. కుముదిని పెళ్ళికొడుకు ఫారిన్ రిటర్న్‌డ్ అయితే తనకి వొరిగిందేమిటి! కుముదిని పెళ్ళికి బాలమురళీ కృష్ణసంగీతకచేరీ ఏర్పాటు చేయాలనుకుంటే తనకేమిటి! పైకి ఎన్ని కబుర్లు చెప్పినా డబ్బూ,దానితోపాటువచ్చే డాబూదర్పంఅంటే యిష్టపడని ఆడవాళ్ళు వుండరు. అవన్నీ యిష్టం లేదని చెప్పి తమని తాము మోసం చేసుకుని ఏవో ఆదర్శాలుఅంటూ బయలుదేరి, చివరికి తాము అశాంతితో బాధపడి, ఎదుటి వాళ్ళని బాధపెట్టడం ఎందుకో! ఆత్మవంచన అనటడంకన్న గత్యంతరంలేదు. ఈవిషయంలో వకుళని అభినందించాలి. వకుళ బి. ఏ చదివే రోజుల్లో సత్యానందం అనే కుర్రవాడు ఆమెని ప్రేమిస్తున్నానని వుత్తరం వ్రాస్తే అతన్ని నిలదీసి ఆమె అడిగిన మాటలు యివి, 'ఆడవాళ్ళకి రకరకాల చీరెలంటే యిష్టం, విలువైన నగలంటే యిష్టం. అలంకరణ అన్నా విందులన్నా, వినోదాలన్నా యిష్టం. మొగవాళ్ళు తమమాట వినడంలేదన్నా, తమ కోర్కెలు తీర్చక పోయినా కష్టం. అందులోనూ అతిగారాబంగా అష్టయిశ్వర్యాలమధ్యా పెరిగిన నాలాంటి అమ్మాయిని భార్యగా కోరే వాడికి పైన చెప్పినవన్నీ ఎదుర్కోగలిగే ధైర్యం వుండాలి. అబ్బాయ్ సత్యానందం, నువ్వు ఇంకా బి. ఏ. లోనే వున్నావ్. ఇంతకన్నాపైకి వెళ్ళగలవంటే నేను నమ్మను— ఈకాలంలోగానీ, మరేకాలంలో నైనాగానీ బ్రతకడానికి కావలసింది డబ్బుగానీ, ప్రేమకాదని తెలుసుకో.........'

అదెబ్బతో సత్యానందం వారం రోజులు జ్వరపడ్డాడంటే అతిశయోక్తికాదు. మనుస్సులోమాట చెప్పేధైర్యం వకుళకుంది. మనస్సుని మోసంచేసుకునేకన్న అదిమేలు కాదా!

సుమిత్ర యింత బలహీనురాలవుతుందని అతనెప్పుడూ అనుకోలేదు. మనస్సుకి సుశిక్షణలేక పోవడమే యిందుకు కారణం కావచ్చు. ఆలోచించడానికి, 'అయ్యో'అని విచారించడానికి కావలసినంత తీరిక వుండడమే మూలహేతువు. ఉద్యోగంలో చేరడమూ ఒకందుకు మంచిదే అనుకున్నాడు కృష్ణమూర్తి. ప్రపంచ పరిస్థితులూ, వ్యక్తుల మనస్తత్వాలు, సంఘం, వీటన్నిటినీ గురించి తెలుసుకోడం మనోవికాసానికి ఎంతో అవసరంకదా! విభిన్న వ్యక్తులతోపరిచయంకూడా అందుకు దోహదం చేస్తుంది.

నెలరోజులు మామూలుగా గడిచిపోయాయి. సుమిత్రకి కుముదినితో సినిమాకి వెళ్ళడం, షాపింగ్‌లకి వెళ్ళడం అలవాటయి పోయింది.

ఎప్పుడైనా తనురమ్మంటే, "సారీ డియర్, వంట్లో అంత బావున్నట్లు లేదు."అనేది ఎవరో పరాయివాళ్ళకి చెప్పినట్లు..

వకుళా శ్రీనివాసరావు మళ్ళీవొచ్చి రెండు రోజులుండి వెళ్ళారు.

"చెవులకింకా ఆపాత మోడలు దిద్దులే వుంచుకున్నావేం— ఇప్పుడు ముత్యాలు కదా ఫ్యాషన్— ఆమధ్యలో ఒకరకం చీరెలొచ్చాయి చూశావా—అలాంటివి నీవు కొనలేదా—ఈడోర్ కర్టెన్ పాతరకంది. ఇప్పుడొస్తున్నాయి చూడు—అలాంటిదైతే మీకు బావుంటుంది. మేం ఈమధ్య కొన్నాం గార్డెన్‌చైర్స్—చాలాబావున్నాయి. అమెరికా నుంచి మంచి గాగుల్స్ తెమ్మంటున్నా మావారిని......."

వకుళ ఎప్పుడు మాట్లాడినా యింతే. ఆమాటలకి సుమిత్ర ఎలా సమాధానాలు చెబుతుందోనని ఆత్రంగా చెవులురిక్కించేవాడు కృష్ణమూర్తి. చాటుగుండా వినడం తప్పని అతనికి తెలుసు. ఒక్కచిరునవ్వుతో యిన్ని మాటలకి సమాధానం యిచ్చే సుమిత్ర గడుసుదనం చూసి సంతోషించాడతను. ఆమెని గురించి తను చాలా పొరపాటుగా అంచనా వేసుకున్నాడేమో— ఎంతైనా సుమిత్ర అందరిలాంటిది కాదు అనుకున్నాడు మళ్ళీ.

ఓ అందమైన సాయంత్రాన తనకికాఫీ టిఫిన్‌లతోపాటు ఓకవరూ, అంతకు పూర్వం ఎన్నడూ నవ్వి ఎరుగని చాలాఅందమైన చిరునవ్వూ అందించింది సుమిత్ర. ఆమెకళ్లల్లో మెరుస్తున్న విజయగర్వం చూసి అది ఎపాయింటుమెంట్ ఆర్డరని పోల్చుకుని, కవరు విప్పకుండానే.

"కంగ్రాచ్యులేషన్స్ సుమిత్రా— మరి నాకు పార్టీ యివ్వవూ—" అన్నాడుబుద్ధిమంతుడికి మల్లె—

"ఏ ఆఫీసులోనో ఏమిటో చూడకుండా....." అంది సుమిత్ర కళ్లు చిట్లించి.

"మలేరియా శాఖలో మాత్రం కాదని నా నమ్మకం........"

అతనితోపాటు మనస్ఫూర్తిగా నవ్వేసింది సుమిత్ర. ఆమె అంతహాయిగా నవ్వి చాలారోజులై వుండవచ్చును..

ఉద్యోగం కోసం ఆమె చాలా ప్రయత్నించి, చాలా ఆత్రుత చూపిందన్నమాట! ఇటీవలే ప్రారంభించిన ఎయిర్‌కండిషన్డ్ హోటల్లో ఐస్‌క్రీం తినిపించింది సుమిత్ర. విమానంలో ప్రయాణం చేస్తున్నట్లు వుంది అందులోకూర్చుంటే— ఆక్షణంలో సుమిత్ర మనస్సులో ఏంఆలోచనలు వుంటాయా అని వూహించాడు కృష్ణమూర్తి. బహుశా ఆమె, వకుళా శ్రీనివాసరావూ విమానంలో అమెరికా వెడుతూ ఎయిర్ హోస్టెస్‌తో చమత్కారాలు విసురుతూ వుండే దృశ్యాన్ని వూహించుకుంటోందేమో......

సుమిత్ర చాలా సంతోషంగా వుంది.

# చిరుగాలి

హోటల్లోనుంచి బయటికి వస్తూనే సంపంగి పువ్వులమ్మే కుర్రాణ్ణి పిలిచి డబను పూలు తీసుకుంది. తనకి సంపెంగలంటే, అందునా కొమ్మ సంపెంగలంటే ప్రాణం. మిల్క్ చాక్లెట్లూ, రోజ్ఎసెన్సు వేసిన ఐస్‌క్రీం, బంగినపల్లి మామిడిపళ్లు, విరజాజులూ, కొమ్మసంపెంగలూ—ఇవన్నీతనకి చాలా యిష్టం. వీటన్నింటికన్న సుమిత్ర యింకా ఎక్కువ యిష్టం.


ఆమెప్రక్కన నడిచి ప్రకాశం రోడ్డు వెంట వెడుతూ వుంటే అతని మెదడులోని జ్ఞాపకాల గదులన్నీ ఒక్కమాటు తలుపులు తెరుచుకున్నాయి........

విజయవాడంటే లారీలనీ ఒకరూ, పందులూ బురదా తప్ప ఇంకేం వుందని ఒకరూ ఎక్కడచూసినా రిక్షాలెడ్‌చేసే పైర్లేనని ఒకరూ, ఇక్కడ జీవించడమే వ్యాపారమైపోయిందని మరొకరూ అంటూరు. కానీ తనకి విజయవాడంటే ఎందుకో చాలా యిష్టం....

కృష్ణాబ్యారేజి దగ్గరవున్న చిన్న పార్కులోకూర్చుని సిగరెట్లు వూదిపారేస్తూ సుమిత్రకోసం గంటలకి గంటలు తపస్సు చేసినరోజులు, విజయవాడ రైల్వేజంక్షన్‌లో ఆమెదిగనున్న రైలుకోసం నిరీక్షిస్తూ హిగిన్ బాథమ్స్‌లో డజన్లకొద్దీ పుస్తకాలు కొన్నరోజులు, కనకదుర్గ దేవాలయం దగ్గర కోనేటి మెట్లమీదకూర్చుని కబుర్లాడిన ఘడియలు. అన్నీ అన్నీ అతని మెదడు చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. సినిమా నిర్మాతలూ, చిల్లర కవులూ 'ప్రేమ' అనే మాటకి విలువ లేకుండా చేశారుగాని ఒక్కమాటలో చెప్పాలంటే సుమిత్రని తను ఎంతగా ప్రేమించాడని!

ఇదంతా ఊహాప్రపంచమని, వాస్తవికంగా ఆలోచించడం చేతకాదనీ వకుళ అనుకోవచ్చు. ప్రేమా, అనురాగం, సానుభూతి, క్షమ వంటి మానవత్వపు లక్షణాలను పూర్తిగా మరిచి, మరీ 'వాస్తవిక' దృష్టితో ఆలోచించడం మొదలు పెడితే హృదయం శిలే అవుతుందేమో సుమిత్ర అన్నట్లు.

మరి సుమిత్ర ఇలా ఎందుకు ప్రవర్తించింది! తన వాస్తవికతా దృక్పథాన్ని కొంచెం సుమిత్ర తలలో ఎక్కించి వెళ్లిందేమో వకుళ! భోజనాలయాక "నేను చాలా అలసిపోయాను నిద్రవస్తోంది" అంటూ పడుకుని నిద్రపోయింది సుమిత్ర. ఆమెని ఎన్నో అడగాలనీ "మనిద్దరి మధ్య తెరలు దింపకు, ప్లీజ్" అని చెప్పాలనీ అనుకున్నాడు కృష్ణమూర్తి. ఆ అవకాశం యివ్వడం యిష్టం లేని సుమిత్ర నిద్రపోయిందని గ్రహించాడతను — సుమిత్ర ముందు తనెప్పుడూ ఓడిపోతూనే వున్నాడు. ఆ శక్తి ఆమె కళ్లల్లోనే వుండి వుండాలి. మరునాడు ఉదయం ఆఫీసుకు వెళ్ళడానికి సుమిత్ర పడుతున్న హడావుడి చూసి నవ్వుకున్నాడు. కొత్తలో అన్నీ అందంగానే వుంటాయి. "సుమిత్రగారు వర్క్ చేస్తున్నారటగా!" అని సోమసుందరం వీలైనంత హేళనగా అడిగినా, "మీకే మోయ్ పట్టిందంతా బంగారమే. ఇద్దరూ చెరి రెండుచేతులా సంపాదిస్తున్నారుగా!" అని సుందరమూర్తి అసూయపడినా, "ఇప్పుడు నదినెకి పని చేయాల్సిన అవసరమేమిటన్నయ్యా? ఆవిడమరీ సుమబాలవంటిది. స్ట్రెయిన్ కదా పాపం!" అని చెల్లి అనసూయ సానుభూతి కురిపించినా అతనికి సుమిత్రమీద కోపం రాలేదు, పైగా ఆమె పట్టుదల, ఓర్పు, దీంకంచూసి ఆశ్చర్యపడ్డాడు కూడా. అతని ఆశ్చర్యం అంతటితో అంతం కాలేదు. ఫస్టుతారీకు సాయంత్రం చాలా ఆలస్యంగా దాదాపు ఏడుంబావుకి యింటికి వచ్చి చేతిలో ప్యాకెట్‌ని టీపాయ్‌మీద పెట్టి అలసటగా సోఫాలోకి చేరబడింది సుమిత్ర. టీపాయ్‌మీద అందంగా ఆసీనమైన ఆపొట్లాంలో ...ట్లు ... ...మాయని ... వూహించగల... ...



బారున్న అంచుగల పట్టుచీరె అయివుంటుంది అనుకున్నాడు కృష్ణమూర్తి. నెల రోజులుగాతన జవరాలి నుదుటికిపట్టిన స్వేద బిందువులన్నీ ఘనీభవించగా తయారైన చీరె అది! ఎంత అందమైనదోగదా! అంత క్రితమే హోటల్‌నుంచి తెప్పించిన కాఫీ ఫ్లాస్కులోనుంచి కప్పులోకి వొంచి ఆమె కందిస్తూ "చాలా అలసి పోయావు". అన్నాడు ప్రేమగా.

ఫస్టుక్లాసు రావాలని చాలా కష్టపడి చదివి, పరీక్షలు చాలా సంతృప్తికరంగా వ్రాసి ఇంటికి వచ్చిన విద్యార్థిలో వుండే అలసటా, తృప్తీ, సంతోషమూ సుమిత్రలో కనిపిస్తున్నాయి. నిజానికి జరీ హంసల బారున్న పట్టుచీరె కోసం సుమిత్ర యింత కష్టపడే అవసరం లేదు. తనతో మాటమాత్రం అంటే వెంటనే కొనితెచ్చేవాడు. యాభై రూపాయలకన్న ఎక్కువ ఖరీదుగల చీరెలుకట్టకూడదని అది తన ఆదర్శానికి విరుద్ధమనీ సుమిత్ర ఎప్పుడూ చెబుతూ వుండడం వలన ఆమెకి ఇంత ఖరీదైన చీరెలు యిష్టం వుండవనుకున్నాడు. స్త్రీ బుద్ధి అతి చంచలమని వూరికే అన్నారా పెద్దలు!

కాఫీకప్పు టేబిల్‌మీద వుంచి, బట్టల ప్యాకెట్ విప్పడం మొదలు పెట్టింది. సుమిత్ర. గారడీవాడు టోపీలోనుంచి కుందేలుని తీసినట్లు అందులోంచి గచ్చకాయరంగు టెరిలిన్ సూటింగ్ తీసి అతని వొడిలోకి విసురుతూ, "ఎలావుంది నా సెలక్షన్?" అంది గర్వంగా.

దాదాపు ఆమె జీతమంత ఖరీదైన ఆ సూటింగ్‌క్లాత్‌ని చూస్తూ నీళ్ళు కారి పోయాడు కృష్ణమూర్తి.

"ఇదేమిటి సుమీ. ఇదేమిటిలా చేశావు? నేనెప్పుడైనా ఇలాంటివి వేసుకున్నానా? ఎందుకు తెచ్చావు చెప్పకుండా!...ఎందుకు. ఎందు......" ఇంకేమీ అనలేకపోయాడు.

"మీకు పెళ్ళయిన తరువాత మానాన్న ఏముచ్చటా తీర్చలేక పోయారు..... అంచేత మీకోరిక నేను తీరుస్తున్నాను. నామూలంగా మీకు కలిగిన నష్టాన్ని పూర్తిచేసే బాధ్యతని నేను పైన వేసుకున్నాను.." సుమిత్ర తలవంచుకుని చాలా నెమ్మదిగా గంభీరంగా [illegible].

ఆమె[illegible]ట్లాడుతోందో అర్థమయ్యేసరికి స[illegible] అక్కడలేదు. గదిలో అద్దం ముందు [illegible]బడి కళ్ళు తుడుచుకుంటోంది.

అతనివొళ్ళో అచేతనంగా పడివున్న గచ్చకాయరంగు టెరిలిన్ గుడ్డ అతన్ని పరిహసించింది. దానిబదులు ఆపొట్లంలో హంసల బారు జరీ అంచు పట్టుచీరె వుంటే అతనెంతో సంతోషించేవాడు. తన ముచ్చట తీర్చడానికి సుమిత్ర యింత కష్టపడుతోందన్నమాట! తనముచ్చట ఖరీదు ఒక అమాయకురాలి స్వేదబిందువులా. సుమిత్ర తనకింత శిక్ష ఎందుకు విధించినట్లు?

గబగబవెళ్ళి ఆమెభుజాలు పట్టుకుని వూపుతూ "ఏం జరిగిందో చెప్పవ్? ఎందుకు ఏడుస్తున్నావ్? నాతో చెప్పక ఎన్నాళ్ళు దాచుకుంటావ్! చెప్పవూ? నాసుమిత్రవి కాదూ? "అన్నాడు.

ఆక్షణంలో సుమిత్ర చాలా చిక్కిపోయి నట్లు అనిపించిందతనికి.

సుమిత్ర అతని చేతులు విడిపించుకుని వెనక్కి జరుగుతూ అన్నది, "ఆరోజుమీరు వకుళతో మీ కష్టసుఖాలన్నీ చెప్పుకున్నారుగా! మీ మనసు, నాకర్థం అయింది. మీముచ్చట....." ఆమె కంఠం వొణికింది.

అతనికి గుర్తువచ్చింది.. అవును వకుళతో.....కానీ, సుమిత్ర తనని ఎందుకిలా అపార్థంచేసుకుంది! తనకామె అంటే విముఖత్వం ఎప్పుడూ కలగలేదు. అప్పట్ల ముచ్చట్లపై మమకారం అసలు లేదు.

"ఆరోజేమిమ్మల్ని అడగాలను కున్నాను. కాని అడగాలనిపించలేదు. నామూలంగా మీకు జరిగిన నష్టానికి......"

"ఛవ్" కృష్ణమూర్తి అసహనంగా అరిచాడు.

"మీ ఆడవాళ్ళకి హృదయాలుండవ్— మీరు పాలని నీళ్ళంటారు—నీళ్ళని పాలంటారు—" అన్నాడు.

సుమిత్ర మళ్ళీ కళ్ళు తుడుచుకున్నది.

"అపార్థం చేసుకోడం తేలిక.. అర్థం చేసుకోడం కష్టం—" అన్నాడు కృష్ణమూర్తి. అక్కడున్న మంచంమీద కూర్చుని సుమిత్రవైపు తీవ్రంగా చూస్తూ....

"మిమ్మల్ని అపార్థం చేసుకున్నన్ని రోజులూ హాయిగానే గడిచి పోయాయి. అర్థం చేసుకున్నప్పటినుంచే బాధగా వుంది. మేకప్ చెరిగిన సినీ తారని చూసినంత బాధగా వుంది.!....."

"నీకు తెలీదు సుమీ! నేను చాలామంచి వాణ్ణి కనుకనే నీమూడ్‌ని అనుసరించి నడుస్తున్నాను. ఇంతగా ఎడ్జస్ట్ అయిపోయే భర్త ఎన్నివేలు గుమ్మరించినా దొరకడుగాక. దొరకడని తెలుసుకో! లక్షలతో వ్యాపారం చేస్తూ పట్టుచీరెలే ధరించే వకుళకి నీకు దొరుకుతున్నంత హాయి దొరకడం లేదనీ ఆమెకన్న నువ్వే సుఖంగా వున్నావనీ తెలుసుకుంటే యింకా సుఖపడిపోతావు— లేకపోతే మనిద్దరికీ అశాంతి తప్పదు" హితబోధ చేస్తున్నట్లు అన్నాడు కృష్ణమూర్తి.

"నేను వకుళని చూసి అసూయపడుతున్నాననుకున్నారు కాబోలు! నాకదేం లేదు మీరే శ్రీనివాసరావు మామగారిలాంటి మామగారు దొరకలేదని చింతపడుతున్నారు" నీవైనంత కోపంగా అంది సుమిత్ర.

"మళ్ళీ చెబుతున్నాను— అపార్థంచేసుకుంటున్నావ్! " బెదిరించాడుకృష్ణమూర్తి."

"మీరే నన్ను అపార్థంచేసుకున్నారు!"

"నేను శ్రీనివాసరావుని ఫ్లాటర్ చేస్తాననీ, ఏడిపిస్తాననీ అలాఅన్నానుగానీ, నీసాక్షిగా నాకలాంటి అసంతృప్తి ఏదీలేదు సుమీ—" అన్నాడు కృష్ణమూర్తి జాలిగా.

ఈసారి సుమిత్ర వెనక్కి తిరిగి అతని ముఖంవంక చూసింది. "అతనుచెప్పేది నిజం—నమ్ము" అంటోంది. అతనివదనం.

"ఏమో— మీ డిప్లొమసీ నాకేంతెలుస్తుంది నేనలా అనుకున్నాను—"అన్నది జావకారిపోతూ....

స్నేహితుడు జగన్నాథం ఒకసందర్భంలో అన్నమాటలు జ్ఞాపకంవచ్చాయి కృష్ణమూర్తికి "స్త్రీలు చాలా సుకుమార హృదయం కలిగి వుంటారు భాయ్! ప్రతి విషయాన్నీ భూతద్దంలో చూసి ఆలోచిస్తారు. విద్యావంతులు మరీను. అంచేత వాళ్ళతో మాట్లాడేటప్పుడు మనం చాలా జాగ్రత్తగా వుండాలి. వాళ్ళని మనం చాలా అపురూపంగా చూసుకోవాలిసుమా" అని!

వకుళనుచూసిన అసూయతో నామనస్సు నిజంగా చెదరలేదా? అని తనని తాను ప్రశ్నించుకుని కృష్ణమూర్తివైపు చూసింది సుమిత్ర. ఆక్షణంలో 'నిజంగా శ్రీనివాసరావుని ఫ్లాటర్ చేయాలనే తాను మామగార్ని గురించి చెప్పాడా?' అని అంతరాత్మని అడుగుతున్నాడు కృష్ణమూర్తి.

ఏమైనా వాళ్ళిద్దరి మనస్సులూ అపుడు పశ్చాత్తాపంతో నిండి పోయిన మాట నిజం.